
—యమ్.జయశ్రీ

## లవ్ ట్రా(ప్)క్

# గుడ్‌బై... టు... ఇండియా



నీరజ ఎన్నో రోజుల్నుంచి ఎదురుచూస్తున్న కోర్కె ఇప్పటికి తీరబోతోంది అదీ వాళ్ళ "బావ" వలన.

లండన్ యూనివర్సిటీలో రీసర్చ్ చేయాలని రెండు సంవత్సరాలుగా ప్రయత్నిస్తోంది.

ఇప్పటికి 'బావ' ప్రయత్నంవల్ల యూనివర్సిటీలో సీటు, పాస్‌పోర్టు వీసా అన్నీ వచ్చేసాయి. పైగా అక్కడి ఫ్రెండ్స్ ద్వారా నీరజ వెళ్లకముందే కొంత బ్యాంక్ బ్యాలన్స్ కూడా ఏర్పాటుచేయగలిగాడు.

అసలు 'బావ' పట్టించుకోకపోతే నీరజ లండన్ వెళ్లడం ఒక కల మాత్రంగానే మిగిలిపోయేది.

వెళ్లేరోజు— ఎయిర్‌పోర్టులో బావ రెండుచేతులూ పట్టుకొని.

"బావా... నీవు చేసిన సహాయానికి ఒట్టి థాంక్సు చెబితే నిన్ను అవమానించినట్టవుతుంది. నీకెలా కృతజ్ఞతలు తెలపాలో అర్థం కావడంలేదు అంది నీరజ.

"ఛ నీకు నాకు మధ్య కృతజ్ఞతలేమిటి? అయినా నీవు తిరిగొచ్చాక తప్పకుండా బదులు తీసుకుంటాను" సీరియస్‌గా నడుస్తూ అన్నాడు.

"అంటే... తిరిగొచ్చాక....?" అర్థంకాక అడిగింది నీరజ.

"అవును నీరూ... నీ మెళ్లో మూడుముళ్లు వేసేస్తే ఫలితం దక్కినట్టే కదా!" కొంటెగా అంటున్నాడతను

"పో బావా... నువ్వన్నీ ఇలాంటి మాటలే మాట్లాడుతావు" ముద్దుగా కసురుకొంది.

"నీరూ... అక్కడికి వెళ్లాక ఈ బావని మర్చిపోమాకు... వారానికొక లెటర్ వ్రాయి- వ్రాయకపోతే..."

"నువ్వు తప్ప నాకెవరున్నారు బావ — తప్పక లెటర్సు వ్రాస్తాను... ప్రామిస్!" చేతిలో చేయివేసి మరీ చెప్పింది.

ఎనౌన్స్‌మెంట్ విని "చెక్ — ఇన్" వైపు నడిచింది నీరజ బావకి వీడ్కోలు చెబుతూ. నాలుగడుగులేసిన నీరజని —

"నీరూ... ఒక్కక్షణం ఆగు—" అంటూ చేతిలో చిన్న కవర్ వుంచుతూ.

"నా ఫోటో— నువ్వు సిగ్గుతో అడగలేక పోయి వుంటావని నేనే తెచ్చాను" చెప్పాడు.

"థాంక్స్ బావా" అంటూ ఆ కవర్ పర్స్‌లో పెట్టింది నీరజ. ప్లేన్‌లో తన సీట్లో రిలాక్సుడుగా వెనక్కి వాలిన నీరజకి బావ ఇచ్చిన కవర్ జ్ఞాపకమొచ్చింది.

ఫోటో తీసి చూసింది—

కుడి కంట్లో తెల్లని మచ్చ— ముఖం అంతా చిన్నచిన్న మచ్చలు వల్లగా మాడినట్టుగా... చిన్నప్పుడే అమ్మవారు పోసి బావ ముఖం వికారంగా తయారైంది.

"తను సిగ్గుతో కాదు- అసహ్యంతోనే ఫోటో అడగలేక పోయిందన్న సత్యం అతనికి ఎప్పటికి తెలుస్తుందో..." అనుకొంటూ ఆ ఫోటోని నాలుగుముక్కలుగా చింపి విండోలోంచి కిందకు విసిరేసింది. *